క్లుప్తంగా

ఆయిల్ ఫాం సాగుపై రైతులకు శిక్షణ

వేముల : ఆయిల్ ఫాం పంటలు సాగు చేసే రైతులకు శుక్రవారం వేముల ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్ ఫాం స్కీంలో భాగంగా ఆయిల్ ఫాం పంటల సాగును ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్ర పాల్గొంటారన్నారు. ఆయిల్ ఫాం సాగు చేయడానికి ఆసక్తి గల, సాగు చేసిన రైతులందరూ పంట సాగు చేసే విధానంపై నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్యాన శాఖ, ఎంకే ఆగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందన్నారు.

ఉపకార వేతనాలతో ఉన్నత విద్యా అవకాశాలు


ఉపాకార వేతనాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మైలవరం : ఉపకార వేతనాలతో విద్యార్థులకు మంచి ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తాయని దొమ్మరనంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నరసమ్మ తెలిపారు. 8వ తరగతి చదువుతున్న 18 మంది విద్యార్థులు నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపిక కావడంతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ప్రతి ఏడాది రూ.12 వేలు 4 సంవత్సరాలపాటు ఉపకార వేతనాలు వస్తాయన్నారు. తల్లిదండ్రులు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

తస్మాత్ జాగ్రత్త


దొమ్మరనంద్యాల వద్ద ఉన్న ప్రమాదకర మలుపు

మైలవరం : మండల పరిధిలోని వేపరాల, దొమ్మరనంద్యాల గ్రామాల సరిహద్దుల వద్ద ఉన్న మలుపులతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ రెండు గ్రామాల్లో సుమారు పది మలుపులకు పైగా ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామంలో ఎక్కువగా ఎనుములు సంచరిస్తున్నాయి. ఆదేవిధంగా రోడ్డు మీదనే ఉన్నతపాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వందల సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లుతుంటారు. ఈ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు గురప్పస్వామి కోన, పీర్‌గైబుసా కొండ, ఆగస్త్యేశ్వరకోన, మైలవరం రిజర్వాయర్‌ను తిలకించటానికి ఈ రహదారినే ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. వాస్తవంగా ప్రధాన రహదారి ఉన్న ఆ రోడ్డులో గుంతల మయం కావడంతో ఎ క్కువ మంది ఈ రహదారినే ఉపయోగించుకుంటున్నారు. అధికారులు వెంటనే ప్రధాన రహదారిని ఏర్పాటు చేసి ఈ గ్రామాల గుండా వెళ్లే వాహనాల రద్దీ తగ్గించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

డ్రోన్ కెమెరాలతో నిఘా


కడపలోని ఓ వీధిలో డ్రోన్ కెమెరాతో తీసిన ఫొటో

కడప కోటిరెడ్డి సర్కిల్: నగరంలోని కళాశాలలు, పాఠశాలల సమీపంలో ఆకతాయిల ఆట కట్టించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నారు. బుధవారం ఉదయం శక్తి టీమ్ ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు భద్రతపై భరోసా కల్పిస్తూ అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. ఈవ్ టీజింగ్ కు పాల్పడే వారిపై దృష్టి సారించారు. మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. పోలీసులు నిరంతరం విజిలెంట్‌గా వ్యవహరిస్తున్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.ఎల్లమరాజు, ఏహెచ్‌టీయూ ఇన్స్పెక్టర్ జి.ఈదురు బాషా, ఎస్ఐలు శ్రీనివాసులు, శాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

దురలవాట్లతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

కడప ఎడ్యుకేషన్: మాదక ద్రవ్యాలకు అలవాటు పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని రిమ్స్ హాస్పిటల్ సైకాలజిస్ట్ డాక్టర్ భాస్కర్ యువతకు సూచించారు. కడప ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మత్తు పదార్థాల నిరోధకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో డ్రగ్స్ అలవాటు మాని ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. సీఐ రామకృష్ణ మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వాడకంతో మతిస్థిమితం కోల్పోతున్నారన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించే వారిలో 15–50 సంవత్సరాలు ఉన్న వారే ఉన్నారు.

మిరప సాగుపై రైతుల పునరాలోచన

- గిట్టుబాటు ధరలేని మిరప
- కోల్డ్ స్టోరేజిలోనే నిల్వ ఉంచిన రైతులు


మిరప పంటకు ఫాలోయింగ్ చేస్తున్న రైతులు(ఫైల్)

మైలవరం : ప్రతి ఏడాది మైలవరం మండలంలోని చిన్నకొమెర్ల, తొర్రివేముల, నార్జాంపల్లి, పెద్దకొమెర్ల, తలమంచిపట్నం గొల్లపల్లి గ్రామాల్లో, పెద్దముడియం మండలంలో మైలవరం ఉత్తర కాలువ కింద ఉన్న భూములు కలిగిన రైతులు మిరప పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. అయితే ప్రస్తుత ఏడాది ఈ పంటపై రైతులు పునరాలోచన చేస్తున్నారు. ఎంతో కష్టపడి పంట పండించిన తర్వాత వచ్చిన దిగుబడి సరైన గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడులకు సైతం నోచుకోలేక రైతులు కుదేలైపోతున్నారు. వాణిజ్య పంటగా సాగుచేస్తున్న మిరప పంట రైతులు గతేడాది విరివిగా సాగుచేశారు. అయితే సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల ఒకవైపు పంట సాగుకు పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు పెరిగి పోతున్న ధరలు మాత్రం రోజు రోజుకు దిగజారుతున్నాయి. మిరపరైతు గతేడాది ఇదే సమయంలో కేజి రూ.200 నుంచి వివిధ రకాలను బట్టి రూ. 250 వరకు ధర పలికింది. దీంతో రైతులు సాగుబడి ఎక్కువగా చేశారు. కానీ ఆశించిన మేర దిగుబడి రాకపోవడం ఒక ఎత్తు అయితే ప్రస్తుతం ఉన్న ధరలు పూర్తి రైతులకు నిరాశలోనికి నేట్టేశాయి. సూపర్ 10, నెంబర్ 5 తదితర మిరప సాగు పంటలు కేజి రూ. 100 కూడా పలకడంలేదు. తేజ రకం మిరప మాత్రం ధర కాస్త ఆశాజనకంగా ఉన్నప్పటికీ అందుకు అయిన ఖర్చులు కూడా ఎక్కువగా ఉన్నాయి. దీంతో రైతులు ప్రస్తుతం వర్షాలు రాక పంట సాగుకు ముగ్గుచూపకపోవడం ఒక ఎత్తు అయితే ధరలను చూసి మరింత ఆందోళన చెందుతున్నారు. ఏదీ ఏమైనా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలైన మిరప సాగు కోసం రైతులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం మిరప ధర కేజి రూ.100 పలకడంలేదు. గతేడాది కూలీలకు రోజుకు కూలి రూ.300 నుంచి రూ.400 ఇచ్చి పంట కోత చేయించుకుంటే అందుకు సంబంధించిన కూలీ కూడా రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పంట పిచుకారి కోసం పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్లు అప్పుగా ఇచ్చిన వ్యాపారస్తులు డబ్బులు కట్టాలంటూ రైతుల ఇళ్ల చుట్టూ తిరుగుతుండటంతో రైతులకు ఎమి చేయాలో తోచడం లేదు. పంటను అమ్ముకుందామంటే ధరలేక ఇబ్బందులు పడుతున్నారు. ఏదీ ఏమైనా ఈ ఏడాది మిరప పంట సాగు తగ్గితే మాత్రం కూలీలకు పనులు కరువు అయ్యే అవకాశం ఉంది.

అక్రమ ముగ్గురాయి తవ్వకాల పరిశీలన

పెండ్లిమర్రి : నాగాయపల్లె సమీపంలోని తుమ్మలూరు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 874లో అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని బుధవారం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, బీట్ ఆఫీసర్ సంజీవ్‌రెడ్డిలు పరిశీలించారు. అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు గనులు-భూగర్భశాఖ పరిధిలో కాకుండా ఫారెస్టు భూమిలో చేపడుతున్నారని మైనింగ్ అధికారులు వారికి నివేదించడంతో ఫారెస్టు అధికారులు తవ్వకాలను పరిశీలించారు. అక్కడ ఎంత మేరకు అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు చేపట్టారని చూట్టు కొలతలు వేశారు. తదుపరి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.


ముగ్గురాయి అక్రమంగా తవ్విన ప్రాంతాన్ని కొలతలు వేస్తున్న ఫారెస్టు అధికారులు

బొల్లి మచ్చలు అంటువ్యాధి కాదు

కడప కోటిరెడ్డిసర్కిల్: బొల్లిమచ్చలు ఒకరినుంచి సంక్రమించే అంటువ్యాధి కాదని రిమ్స్ డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ పెంచలయ్య అన్నారు. ప్రపంచ బొల్లి మచ్చల దినోత్సవం సందర్భంగా కడప రిమ్స్‌లోని చర్మవ్యాధుల(డెర్మటాలజీ) విభాగంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ బొల్లి మచ్చలు వంశపారపర్యంగా, ఒకరి నుంచి ఒకరికి వచ్చే వ్యాధి కాదన్నారు. బొల్లి మచ్చలతో ఒక వ్యక్తి శారీరక, మానసిక సామర్థ్యంపై ఎలాంటి ప్రభావం ఉండబోదన్నారు. ప్రారంభ దశలోనే చర్మవ్యాధుల నిపుణుల పర్యవేక్షణలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. తెల్ల మచ్చలు, బొల్లి మచ్చలున్న వారిపై వివక్ష చూపకుండా సమాజంలో అందరితో సమానంగా ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డెర్మటాలజీ విభాగం వైద్యులు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ నరోత్తమరెడ్డి, డాక్టర్ విజయకుమారి, డాక్టర్.షాలిని, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదు


అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు


సదస్సులో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

చింతకొమ్మదిన్నె : తమకు తెలియని అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. బుధవారం సీఐ నాగరాజు ఎన్‌సీసీ 30వ ఆంధ్ర బెటాలియన్‌లో కల్నల్ ఎన్వీ మోనిస్ సహకారంతో సైబర్ క్రైమ్, సోషల్ మీడియాపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం సైబర్ క్రైమ్ రూపంలోనే ఎక్కువ మోసాలు జరుగుతున్నాయని ఎక్కువగా మహిళలను టార్గెట్ చేసి మోసాలు చేస్తున్నారని తెలిపారు. సైబర్ మోసాలు వల్ల మోసపోయిన బాధితులు మానసికంగా నలిగిపోతూ ఆత్మహత్యాప్రయత్నం కూడా చేస్తున్నారన్నారు. ఈకేవైసీ, ఆధార్ అప్డేట్, బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి కాల్ చేసే అపరిచితులకు దయచేసి ఓటీపీలను చెప్పకూడదన్నారు. బ్యాంకు వారు ఎప్పుడు కూడా అటువంటి కాల్స్, మెసేజెస్ చేయరన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి లేదా స్వయంగా సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేస్తే పోలీస్ శాఖ వారు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేస్తున్నారన్నారు. కడప జిల్లా వ్యాప్తంగా సుమారు 20 అవగాహన సదస్సులను నిర్వహించామన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో 300 మంది ఎన్‌సీసీ విద్యార్థులు, సైబర్ క్రైమ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపైనే తోపుడు బండ్లు

– ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


వాహనాలు ఉండాల్సిన చోట ఉన్న తోపుడుబండ్లు

పులివెందుల రూరల్ : పట్టణంలో బోలే వార్డులో ద్విచక్ర వాహనాల కోసం పార్కింగ్‌ను పోలీసులు ఏర్పాటు చేశారు. ఫుట్‌పాత్‌పైనే పార్కింగ్ చేయాల్సిన ప్రాంతాలలో తోపుడుబండ్లు ఎక్కడ పడితే అక్కడ ఉంచడంతో వాహనదారులు వాహనాలు ఎక్కడ పెట్టాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. తోపుడుబండ్లు ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైన ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం, సాయంత్రం వెళల్లో బోలేవార్డులో నడిచే దానికి కూడా రోడ్డు లేక పోవడంతో పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్‌శాఖ అధికారులు రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆనాటి కార్మిక చట్టాలను కాలరాయొద్దు

కడప ఎడ్యుకేషన్: కార్మికులు త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను కుదించి వారి హక్కులను కాలరాయొద్దు అని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు అన్నారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కడప నగరంలోని తమ సంస్థ కార్యాలయలో జరిగిన సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని ట్రేడ్ యూనియన్లు, స్వతంత్ర సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల నాయకులు పాల్గొనాలని కోరారు.

ఎమర్జెన్సీ భారతదేశంలో ఒక గడ్డు కాలం


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర

వేంపల్లె : ప్రజల స్వేచ్ఛ స్వాతంత్రాన్ని హరించిన ఏ ప్రభుత్వం ఎక్కువకాలం ప్రజాభిప్రాయాన్ని పొందలేదని కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమ్మిదాన హత్య దివాస్‌ను పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ 1975లో నాటి ఇందిరా గాంధీ నిర్బంధించిన ఎమర్జెన్సీ కాలం భారతదేశ చరిత్రలో చాలా గడ్డు కాలమని, ప్రజల యొక్క స్వేచ్ఛ, స్వాతంత్రాలు పత్రికల స్వాతంత్రాన్ని అపహరించి వేలాది మందిని జైలులో నిర్బంధించారన్నారు. 22 నెలల కాలం పాటు కొనసాగిన ఎమర్జెన్సీ కాలంలో జయ ప్రకాష్ నారాయణ, లాల్‌కృష్ణ, అద్వానీ, అటల్ బిహారివాజ్‌పేయి లాంటి ప్రముఖులతోపాటు నాటి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించినా అనేకమంది ప్రజలను సైతం జైలులో నిర్బంధించి చిత్రహింసలకు గురి చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పాఠశాల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలే


నివేదిత పాఠశాల వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్య

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీనివాస హాలు సమీపంలోని నివేదిత పాఠశాల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుండటంతో పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల వదిలే సమయంలో ఈ ప్రాంతంలో పాఠశాల బస్సుల తోపాటు బస్సులు, ఆటోలు రద్దీగా ఉండటంతో రోడ్డు దాటాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల యజమాన్యం కానీ, పోలీసులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాఠశాల యాజమాన్యం స్పందించి పాఠశాల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, విద్యార్థుల రోడ్డు దాటేటప్పుడు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య

సింహాద్రిపురం : సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. బుధవారం బిదినంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీలకు, ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు గ్రామాలకు వెళ్ళినప్పుడు ప్రజలకు దోమకాటు వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కల్పించి దోమలు వృద్ధిని అడ్డుకునే మార్గాలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచే విధానాలు తదితర వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు గ్రూప్ మీటింగ్‌లు పెట్టి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, పీహెచ్ఎన్ పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి


కమలాపురంలో వ్యవసాయంలో పాటించాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్న ఏఓ సరస్వతి


వేములలో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరిస్తున్న ఏఓ ఓబులేసు


చక్రాయపేటలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారి చంద్రశేఖరరెడ్డి


వల్లూరులో రైతులచే ద్రవ జీవామృతం తయారు చేయిస్తున్న అధికారులు


ముద్దనూరులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ, ఏవో, రైతులు

కమలాపురం : రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని కె.అప్పాయపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పలు రకాల పంటల సాగు, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. రసాయనిక ఎరువులు విచక్షణారహితంగా వాడటం వలన వివిధ రకాల సూక్ష్మ పోషక లోపాలు కనిపిస్తున్నాయని ఆమె సూచించారు. పంటపై లోప లక్షణాలు గమనించినప్పుడు మాత్రమే రైతులు సవరణ చర్యలు చేపడుతున్నారని, పంటల సంరక్షణకు ఇది సరైన పద్ధతి కాదన్నారు. మొక్కలో సరైన పెరుగుదల, అభివృద్ధి, ఉత్పత్తి కొరకు అన్ని పోషకాలు సమతుల్యంగా అందించాలన్నారు. భాస్వరం ఎరువును జింక్ సల్ఫేట్‌తో కలిపి భూమిలో వినియోగించ రాదన్నారు. జింకు, భాస్వరం ఎరువుల వినియోగం మధ్య మూడు రోజుల వ్యవధి ఉండాలన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. పరీక్ష ఫలితాల ద్వారా అధికారులు సిఫార్సు చేసిన ఎరువులను మాత్రమే రైతులు వినియోగించాలని ఆమె సూచించారు. వరిలో ప్రతి మూడు సీజన్లకు ఒక సారి ఏకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను ఆఖరి దుక్కుల్లో వేసుకోవడం వలన జింక్ లోపాలను నివారించ వచ్చన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు వరి నారు కొనలు తుంచి నాటుకోవాలన్నారు. వరి నాటు వేసే సమయంలో ప్రతి రెండు మీటర్లకు 30 సెంమీ. వెడల్పు గల కాలిబాటలు తీయాలన్నారు. దీని వలన మొక్కలకు గాలి, వెలుతురు బాగా అందుతాయని, తద్వారా దోమపోటును నివారించవచ్చన్నారు. పొలం గట్ల పై కలుపు లేకుండా శుభ్రం చేసుకోవడం వలన పాము పొడ తెగులు వ్యాప్తి తగ్గుతుందన్నారు. పొలం గట్లపై బంతి, చామంతి, అలసంద, నువ్వు మొదలైన మొక్కలు నాటినట్లయితే మిత్ర పురుగుల అభివృద్ధి పెరుగుతుందని, దీని ద్వారా క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గించవచ్చన్నారు. పచ్చిరొట్ట ఎరువులు లేదా ప్రీ మాన్సూన్ డ్రై సీడ్స్ సాగును, జీవన ఎరువుల వాడకాన్ని రైతులు విరివిగా వినియోగించా లన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసిన రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏఓ ఓబులేసు సూచించారు. మండలంలోని మీదిపెంట్ల గ్రామ రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగలో మువ్వకుళ్లు తెగులు నివారణకు, రసం పీల్చు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కంచె పంటగా జొన్న, సజ్జ మూడు వరుసలలో వేయాలన్నారు. ఎల్లో, గ్రీన్ కార్డులు ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల కొంత వరకు రసంపీల్చు పురుగులను నివారించవచ్చునన్నారు. అలాగే అరటి పంటలో తెగుళ్ల, వాటి నివారణకు సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. సిగటోకా, మచ్చ తెగులు రాకుండా టిల్ట్ 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అరటికి సేంద్రీయ ఎరువులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పొటాష్, భూసార పరీక్షలు అనుసరించి తగిన మోతాదులో పొటాష్ వాడాలన్నారు. దీనివల్ల అరటి గెల బరువుతోపాటు సాంద్రత, పరిమాణం బాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్ఏ సంతోష్, రైతులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : రైతులు తాము సాగు చేసిన పంటల్లో ఎప్పటి కప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడితేనే మంచి దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మహదేవపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో సాగు చేసే వరి, వేరుశనగ పంటలకు సోకే తెగుళ్ల, పురుగుల వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను, విత్తన శుద్ధి తదితరాలపై అవగాహణ కల్పించారు. ఉద్యాన పంటలకు సంబంధించి పూలసాగు, మల్చింగ్, కూరగాయల సాగు విధానాలను వివరించారు.అనంతరం గంగారపువాండ్లపల్లెలో సాగులో ఉన్న ప్రత్తి పంటను పరిశీలించారు. ప్రత్తి పంటలో ఉన్న దోమ, పచ్చ దోమను గుర్తించి వాటి నివారణ మార్గాలను వివరించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ శివలలిత, జడ్‌పీఎస్ఎఫ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

వల్లూరులో..

వల్లూరు : ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోటూరు గ్రామ పంచాయతీలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇందులో డెమోగా ద్రవ జీవామృతాన్ని రైతులచే స్వయంగా తయారు చేయించారు. కార్యక్రమంలో కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జి ఇంద్రజ, యూనిట్ ఇన్‌చార్జి ఓబులయ్య, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : పత్తి పంటలో రసంపీల్చే పురుగు ఉధృతిని నివారించి పంటను కాపాడుకోవాలని, దీనికి తగిన సలహాలు పాటించాలని డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ఒంటిగారిపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పసుపు రంగు జిగురు అట్టలను పంటలో అమర్చుకోవాలని, పొలంలో ఎకరానికి 8 చొప్పున లింగాకర్షణ అట్టలు పెట్టుకుని రసంపీల్చే పురుగును పత్తి రైతులు నివారించుకోవ్వని తెలిపారు. మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ కంది పంట సాగుచేసే రైతులకు త్వరలోనే మినీ కిట్స్ అందిస్తామని, పంట సాగు చేసే రైతులు పంట నమోదు చేయించుకోవాలని, ఖరీఫ్‌లో సాగుచేసే పంటలకు తప్పకుండా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు.